సాక్షి
కుమురం భీం

గురువారం, 25, సెప్టెంబర్, 2025



బతుకమ్మ.. పూలసాగు

ఉమ్మడి జిల్లాలో పలువురు రైతులు బంతిపూలు సాగు చేస్తున్నారు. బతుకమ్మ పండుగ సమయంలో పూలు విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు.

IIలో▸



పారిశుద్ధ్యం.. పరిహాసం

కాగజ్‌నగర్ రైల్వే కాలనీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. పిచ్చిమొక్కలు పెరగడంతోపాటు ఎక్కడచూసినా చెత్తాచెదారం దర్శనమిస్తుంది.

IIIలో▸

గరిష్టం/కనిష్టం
27.1 /24.6

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీలో లక్కీడ్రా స్కీం

ఆసిఫాబాద్‌అర్బన్: దసరా పండుగ నేపథ్యంలో ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6 వరకు ఆర్టీసీలో ప్రత్యేక లక్కీడ్రా స్కీం అమలు చేస్తున్నట్లు డీఎం కేవీ రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ లగ్జరీ, లహరీ బస్సుల్లో మాత్రమే ఈ స్కీం వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ బస్టాండ్లలో లక్కీడ్రా బాక్సులు ఏర్పాటు చేస్తున్నామని, ప్రయాణం తర్వాత టికెట్ వెనుక ప్రయాణికుడి పేరు, చిరునామా, సెల్ నంబర్ రాసి వేసి బాక్సుల్లో వేయాలని సూచించారు. అక్టోబర్ 8న సాయంత్రం ఆదిలాబాద్ పట్టణంలోని రీజినల్ మేనేజర్ కార్యాలయంలో లక్కీడ్రా తీస్తారని తెలిపారు. మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి 1,5000, మూడో బహుమతి రూ.10వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

పెంచికల్‌పేట్(సిర్పూర్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో సీతారాం అన్నారు. పెంచికల్‌పేట్ పీహెచ్‌సీలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఎముకలు, కీళ్ల వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అంతకు ముందు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 63 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు తిరుమలేశ్ (ఆర్థో), పీహెచ్‌సీ వైద్యురాలు అర్చిన్, ఎంపీడీవో అల్బర్ట్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

కౌటాల(సిర్పూర్): కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని పీడీ హరికృష్ణ బుధవారం తెలిపారు. జైనూర్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో కార్తీక్, మనస్వి, కీర్తన, దివ్య, సరిత, కావేరీ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరంతా ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. క్రీడాకారులను హెచ్‌ఎం నారాయణ్‌సింగ్ అభినందించారు.

నియామకాల్లో హైర్ బస్సు డ్రైవర్లకు వెయిటేజీ ఇవ్వాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీ ఉద్యోగ నియామకాల్లో ప్రైవేట్ హైర్ బస్సు డ్రైవర్లకు 30శాతం వెయిటేజీ ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బుధవారం డిపో మేనేజర్ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లో డ్రైవర్లు, శ్రామిక్, ఇతర కేటగిరీల్లో ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. ఇందులో హైర్ బస్సు, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లకు వెయిటేజీ ఇవ్వాలని కోరారు. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ఆర్టీసీకి లాభాలు తీసుకురావడంలో వీరు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వెయిటేజీ ప్రకటించని పక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉపేందర్, ప్రైవేటు హైర్ బస్సు డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు మధుసూదన్, ఉపాధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కోర్టు పీపీగా శ్రీనివాస్




శ్రీనివాస్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా మహోల్కర్ శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక న్యాయవాదులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ సేవలకు ప్రత్యేక యాప్

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ రూపొందించినట్లు ఆసిఫాబాద్ సర్కిల్ ఎస్ఈ రాథోడ్ శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. 20 ఫీచర్లతో ఉండే ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్లలో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్, కన్స్యూమర్ గ్రీవెన్స్, సెల్ఫ్ రీడింగ్, పే బిల్స్, బిల్ హిస్టరీ, ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ, నూతన కనెక్షన్, లింక్ ఆధార్- మొబైల్, నూతన కనెక్షన్ పొందడం, పేరు, లోడ్ మార్పు, తదితర వివరాలతో అధికారుల సమాచారం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సందేహాలు, సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబర్లు 1800 425 0028, 1912ను వినియోగించుకోవాలని సూచించారు.

స్థానికం వైపు అడుగులు!



- రిజర్వేషన్ల ఖరారుపై అధికారుల కసరత్తు
- ఆశావహుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ
- ఈ నెల 26లోగా జిల్లా అధికారులకు శిక్షణ

ఆసిఫాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలకు అడుగులు పడుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్ దోత్రే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసే ప్రక్రియపై విధివిధానాలపై అధికారులతో చర్చించారు. ఈ నెల 22న ఎంపీడీవోలు, ఎంపీవోలతో సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 9 నుంచి నవంబర్ 10 లోగా ఎన్నికల ప్రక్రియ ముగించేలా ఎన్నికల కమిషన్ చర్యలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 29న షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల జనాభా ప్రామాణికంగా తీసుకోనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రిజర్వేషన్ల ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రిజర్వేషన్ల ఖరారు విషయంలో గతంలో, ఇప్పుడు ఎలా ఉన్నాయనే అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. వార్డు సభ్యుల రిజర్వేషన్లను జనాభా ఆధారంగా పంచాయతీ కార్యదర్శులు ఖరారు చేయనున్నారు. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే రిజర్వేషన్లు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

335 గ్రామ పంచాయతీలు

జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో 2,874 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 3,53,895 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. వీరిలో 1,76,606 మంది పురుషులు, 1,77,269 మంది మహిళలు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 127 ఎంపీటీసీ, 15 జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకు దాదాపు రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశావహులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఆరేళ్ల క్రితం గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించగా, 2024 ఫిబ్రవరి 1న పదవీ కాలం ముగిసింది. ఎంపీటీసీ స్థానాలకు 2019లో ఎన్నికలు నిర్వహించారు.

ఆశావహుల్లో ఉత్కంఠ

స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశించడంతో గ్రామాల్లో ఎన్నికల చర్చ మొదలైంది. రిజర్వేషన్ల మార్పుపై ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు అలాగే ఉంటాయా, మారుతాయా అనే చర్చ సాగుతోంది. ప్రస్తుత పట్టున్న స్థానాల్లో కాకుండా వేరే స్థానాల్లో రిజర్వేషన్లు అనుకూలిస్తే పరిస్థితి ఎలా ఉంటుందన్న ఆందోళన నెలకొంది. అధిక వర్షాలు, పండుగల సీజన్ కావడంతో అసలు ఎన్నికలు నిర్వహిస్తారా అనే సందేహం కూడా కొందరిలో ఉంది. యూరియా కొరత ఎన్నికల్లో ప్రభావం చూపనుంది.

అధికారులు సన్నద్ధం

ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం కావడం, ప్రస్తుతం రిజర్వేషన్ల ప్రక్రియ కూడా కొలిక్కి రావడంతో ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా నిర్వహించేలా అధికారులు సన్నద్ధమవుతున్నారు. రిజర్వేషన్ల ప్రక్రియ నివేదికలకు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు సమర్పించారు. జిల్లా అధికారులు ఆర్‌వోలు, పీవోలు, ఏపీవోలకు ఈ నెల 26లోపు శిక్షణ పూర్తి చేసేందుకు చర్యలు ప్రారంభించారు. జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించడంతోపాటు మైక్రో అబ్జర్వర్లను నియమిస్తున్నారు.

రిజర్వేషన్లు, ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఏవిధంగా ముందుకెళ్తుందో వేచిచూడాలి.

పండుగకు పస్తులేనా..?

- పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా అందని వేతనాలు



చెత్త సేకరిస్తున్న పంచాయతీ కార్మికులు(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. ఒకే నెలలో దసరా, దీపావళి పండుగలు వస్తుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల పరిధిలో 1035 మంది మల్టీపర్పస్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి అదనంగా రోజువారీగా మరో 400 మంది వరకు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వాలు మారుతున్నా వీరికి నెలనెలా వేతనాలు మాత్రం అందడం లేదు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వంపై ఆశతో ఇతర పనుల్లోకి వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో కీలకం..

జిల్లాలోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ కార్మికుల శ్రమ కీలకం. వీధుల్లోని చెత్తను నిత్యం సేకరిస్తూ డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. రోజువారీ పనులతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రత్యేక కార్యక్రమాల్లోనూ వీరు పాల్గొంటున్నారు. కార్మికులకు ప్రస్తుతం నెలకు రూ.9,500 చెల్లిస్తున్నారు. చాలీచాలని వేతనమైనా సకాలంలో అందడం లేదు. ప్రస్తుతం మూడు నెలలుగా పెండింగ్ ఉండటంతో ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతున్నారు. జీతాలు ఆలస్యం కాకుండా గ్రీన్ చానల్ ద్వారా ప్రతినెలా 1న చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, కనీస వేతనం అమలు చేయాలని, కార్మికులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రమం తప్పకుండా చెల్లించాలి



గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేసి, ఇక నుంచి క్రమం తప్పకుండా నెలనెలా చెల్లించాలి. అలాగే కార్మికులకు శాపంగా మారిన మల్టీపర్పస్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి. పెండింగ్ వేతనాలు చెల్లించని పక్షంలో దసరాకు ముందు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతాం.

– శ్రీకాంత్, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి

ఆందోళన చెందొద్దు

గ్రామ పంచాయతీ కార్మికులు వేతనాల కోసం ఆందోళన చెందొద్దు. దసరాలోగా వేతనాలు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటాం. అలాగే ఇతర సమస్యలు పరిష్కరిస్తాం.

– భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి

పాఠశాలల్లో వసతుల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్, గదుల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. అర్ధంతరంగా నిలిచిపోయిన పనులపై కాంట్రాక్టర్లను సంప్రదించాలన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన వసతుల కల్పన పనులు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో విద్యాశాఖ ఎస్‌వోలు అబిద్ అలీ, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఉద్యోగులకు బంగారు పతకాలు



పతకాలతో అనురాధ, కోటంక మమత

రెబ్బెన(ఆసిఫాబాద్): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సింగరేణి కంపెనీ లెవల్ వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బెల్లంపల్లి ఏరియాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. ఏరియాకు చెందిన అనురాధ 57కిలోల విభాగంలో బంగారు పతకం సాధించగా, కోటంక మమత 47కిలోల విభాగంలో బంగారు పతకం సాధించారు. సింగరేణి కంపెనీ లెవల్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన వీరు కోల్ ఇండియా లెవల్ పోటీలకు ఎంపికయ్యారు. బంగారు పతకాలు సాధించిన ఏరియా క్రీడాకారులు అక్టోబర్ 14 నుంచి 16 వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వేదికగా జరి గే కోల్ ఇండియా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడాకారులను ఏరియా అధికారులు, తోటి ఉద్యోగులు అభినందించారు.

‘రైతులకు తీవ్ర అన్యాయం’



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

బెజ్జూర్: బీజేపీ నాయకులు తమ గోదాములకు యూరియా తరలించి తీవ్ర అన్యాయం చేశారని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం రూ.270కు లభించాల్సిన యూరియా బస్తా బ్లాక్ మార్కెట్లో రూ.వెయ్యికి దొరుకుతుందని తెలిపారు. దిండా పోడు రైతుల బాధ్యతను ఎమ్మెల్యే హరీశ్ బాబు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అర్షద్ హుస్సేన్, సారయ్య, తిరుపతి, ఇస్తారీ, ఖాజా మోయినొద్దీన్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

‘అజీమ్ ప్రేమ్‌జీ’ స్కాలర్‌షిప్‌పై అవగాహన

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న స్కాలర్‌షిప్‌లపై బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ చదివి పాసై, ప్రభుత్వ కళాశాలలో డిగ్రీలో చదువుతున్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైనవారికి ఏటా రూ.30వేల చొప్పున సాయం అందిస్తారని అన్నారు. శ్యామ్‌రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అన్నపూర్ణదేవిగా దుర్గామాత

జిల్లావ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెబ్బెన మండలం ఇందిరానగర్ ఆలయంలో కనకదుర్గామాత బుధవారం భక్తులకు అన్నపూర్ణదేవి(శాకాంబరి) అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ కూరగాయలతో అలంకరించారు. - రెబ్బెన

అన్నపూర్ణదేవి అలంకరణలో కనకదుర్గామాత

సర్కారు విద్యార్థులకు సదావకాశం

- ఎనిమిదో తరగతికి వారికి ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్ షిప్
- అక్టోబర్ 6 వరకు దరఖాస్తు గడువు
- నవంబర్ 23న పరీక్ష



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితులు అనుకూలించక నిరుపేద విద్యార్థులు మధ్యలోనే చదువు వదిలేస్తున్నారు. అలాంటి వారికి ఆర్థిక చేయూత అందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్) అందిస్తోంది. ప్రతిభ కలిగిన వారి ఉన్నత చదువులకు తోడ్పాటునందిస్తోంది. 2025- 26 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నవంబర్ 23న అర్హత పరీక్ష నిర్వహించనుండగా, అక్టోబర్ 6 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది.

దరఖాస్తు ఇలా..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 721 ఉండగా, 29,246 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో ఎనిమిదో తరగతి వారు 3,821 మంది ఉన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మెరిట్ స్కాలర్‌షిప్‌నకు అర్హులు. వీరు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫారాలు తీసుకుని వివరాలు నింపాలి. వాటితోపాటు ఓసీ, బీసీ, మైనార్టీలు అయితే రూ.100, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగులు రూ.50 డీడీ తీసి దరఖాస్తును జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో అందించాలి. నవంబర్ 23న దేశవ్యాప్తంగా ఒకేసారి అర్హత పరీక్ష నిర్వహిస్తారు. మెరిట్ ఆధారంగా స్కాలర్‌షిప్ అందిస్తారు.

అర్హతలు ఇవే..

8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. ఏడో తరగతి వార్షిక పరీక్షలో 55 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 50 శాతం మార్కులు ఉన్నా సరిపోతుంది. ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతూ ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50లోపు ఉండాలి. హాస్టల్ సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. వసతిగృహాల్లో చదివేవారు అర్హులు కారు. ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్ జత చేయాలి. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎక్కువ మంది ఏటా స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధిస్తున్నారు.

180 మార్కులతో పేపర్

మల్టీపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 180 మార్కుల ప్రశ్నపత్రం రెండు విభాగాలుగా ఉంటుంది. పార్ట్ ఏలో మానసిక సామర్థ్య పరీక్ష 90 మార్కులకు 90 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో కోడింగ్, డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్ చిత్రాలు, మిర్రర్ చిత్రాలు, వాటర్ ఇమేజెస్, రీజనింగ్ ఎబిలిటీ, సంఖ్యాశాస్త్రం, పదాల భిన్నాలు, నంబర్ అనాలజీ, ఆల్ఫాబెట్ అనాలజీకి సంబంధించిన అంశాలు ఉంటాయి, పార్ట్ బీలో 30 మార్కులు సాంఘిక శాస్త్రం, 30 మార్కులు సామాన్య శాస్త్రం, 8వ తరగతి సంబంధించిన 30 ప్రశ్నలకు 30 మార్కులు కేటాయిస్తారు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మీడియాల్లో అందిస్తారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

జిల్లాలోని ఉన్నత పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించి దరఖాస్తు చేయించాలి. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధిస్తే ఇంటర్ వరకు ఏటా రూ.12 వేలు స్కాలర్‌షిప్ వస్తుంది. విద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదువుకుంటారు. ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించి పరీక్ష రాయించాలి.

– ఉదయ్‌బాబు, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి

ఏజీపీగా మనోహర్‌రావు నియామకం

మంచిర్యాలక్రైం: స్థానిక ప్రిన్సిపల్ సబ్ కోర్టుకు అసిస్టెంటు గవర్నమెంటు ప్లీడర్(ఏజీపీ)గా దండనాయకుల మనోహర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన మనోహర్‌రావు 2005లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2010నుంచి మంచిర్యాల బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా వృత్తి నిర్వహణలో ఉన్నారు. ఆయనను జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు న్యాయవాదులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఉట్నూర్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్, మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మహమ్మద్ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు అక్టోబర్ 5లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 6 నుంచి కుట్టు మిషన్, 8 నుంచి మగ్గం వర్క్ తరగతులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, ఉచిత భోజనం, బస్సు చార్జీలు, రెండు జతల యూనిఫాం, టూల్ కిట్లు, శిక్షణ అనంతరం కోర్సు ధ్రువీకరణ పత్రం అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 99494 12159, 89856 33226, 94415 30494, 80960 93085 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మిషన్ భగీరథ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ(గ్రిడ్) పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు ఆరు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈపీఎఫ్, ఈఎస్ఐ పూర్తి వివరాలు తెలియజేయాలని, ప్రతీ కార్మికుడికి బోనస్, కనీస వేతనంగా రూ.26వేలు చెల్లించాలని, ప్రతినెలా 1న వేతనాలు విడుదల చేయాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ డేవిడ్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి, నాయకులు బాలేశ్, షేక్ షకీర్, కార్మికులు రఫీక్, భగవత్, పురుషోత్తం, రవీందర్, సోహెల్, వెంకటేశ్, తాజ్, లక్ష్మణ్, శివ, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పండుగ అడ్వాన్స్ చెల్లించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగుల మాదిరి డైస్, రేడియోగ్రాఫర్లకు దసరా పండుగ అడ్వాన్స్ చెల్లించాలని బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీసం రూ.20వేలను దసరా అడ్వాన్స్‌గా ఇవ్వాలని కోరారు. పర్మినెంట్ ఉద్యోగులతో కలిసి శ్రమిస్తూ ఎన్‌హెచ్‌ఎం సంస్థ అభివృద్ధికి తోడ్పాడుతున్న వారిని విస్మరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నగేశ్, ప్రవీణ్, షకీల్, జీవిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న నాటుసారా

దహెగాం: మండలంలోని దేవులగూడ, మర్రిపల్లి, కల్వాడ గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై బుధవారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. బెల్లం పానకం ధ్వంసం చేసి 12 లీటర్ల నాటుసారా, 10 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మర్రిపల్లికి చెందిన బాదావత్ రాజేందర్, దరావత్ వందనపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఆదిలాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్, ఎస్సైలు లోభానంద్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురి రిమాండ్

నెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామంలో ఓ ఇంటిని ధ్వంసం చేసిన కేసులో నలుగురిని మంగళవారం రాత్రి నెన్నెల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగారాం గ్రామంలో తల్లి ప్రవర్తన నచ్చక కొడుకు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా.. ఆవుడం గ్రామానికి చెందిన మంగళి తిరుపతి కారణంగానే బలవన్మరణానికి పాల్పడ్డాడని గంగారాం, ఆవుడం, చిత్తాపూర్ గ్రామాలకు చెందిన పలువురు ఆగస్టు 7న తిరుపతి ఇంటిపై దాడి చేశారు. ఇల్లు ధ్వంసం చేయడంతోపాటు నిప్పు పెట్టారు. తిరుపతి భార్య ఫిర్యాదు మేరకు శాంతిభద్రతలకు విఘాతం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన 30 మందిపై కేసు నమోదు చేశారు. వారిలో గంగారాం గ్రామానికి చెందిన నరిగ మల్లేష్, నరిగ రాజ్‌కుమార్, చౌడ సందీప్, చిత్తాపూర్‌కు చెందిన గంధం సాయి, సుష్మంత్‌లను అరెస్ట్ చేసి బెల్లంపల్లి కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు.

దేశీదారు పట్టివేత



దేశీదారు, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మహారాష్ట్ర నుంచి జిల్లాకు దేశీదారు తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. పెన్‌గంగా నది ఒడ్డున పెండల్‌వాడ గ్రామ శివారులో రూ.30వేల విలువైన 404 దేశీదారు బాటిళ్లను పట్టుకున్నారు. పెండల్‌వాడ గ్రామానికి చెందిన అడిగే రమేష్, టార్పే వినోద్, పద్రె గజానంద్ దేశీదారు తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. దేశీదారు అక్రమ రవాణా చేసినా, విక్రయాలు జరిపినా కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

పట్టుకున్న మద్యం ధ్వంసం



బెల్లం, పటిక ధ్వంసం చేస్తున్న అధికారులు

నేరడిగొండ: ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కొన్ని రోజుల క్రితం పట్టుబడిన మద్యం, బెల్లం, పటికలను బుధవారం ఎక్సైజ్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. మద్యం విలువ రూ.1.13 లక్షలు, బెల్లం, పటికతో పాటు 5 లీటర్ల గుడుంబా విలువ రూ.2.30 లక్షలు ఉంటుందని ఇచ్చోడ ఎక్సైజ్ శాఖ సీఐ జుల్ఫేఖార్ అహ్మద్, ఎస్సై ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు.

కూలీ ఆత్మహత్య



మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్సై

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన కూలీ గడ్డం ఎల్లయ్య(45) బుధవారం ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. గత రెండు నెలల క్రితం పాము కాటు కారణంగా వైద్య ఖర్చుల కోసం అప్పులు చేశాడని తెలిపారు. అప్పులు తీర్చలేక ఆర్థిక ఇబ్బందులతో గ్రామ శివారులోని మామిడి తోటలో ఉదయం చెట్టుకు ఉరేసుకున్నాడని పేర్కొన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బతుకమ్మ..పూలసాగు

- పూల సాగుతో ఉపాధి పొందుతున్న పలువురు

బతుకమ్మ.. ఆడబిడ్డలకు సంబరాలు పంచే పండుగ. ఈ వేడుకలో తీరొక్క పూలే కీలకం. బంతి, చేమంతి, గునుగు, కట్ల, సీతమ్మజడ పూలతోనే రూపుదిద్దుకుంటోంది సింగిడి. అలాంటి పూలను సాగు చేస్తూ లాభాల బాట పడుతున్నారు ఉమ్మడి జిల్లా పరిధిలోని పలువురు రైతులు. ఏటా పండుగ సీజన్‌లో ఉపాధి పొందుతున్న పలువురిపై ప్రత్యేక కథనం.



నెన్నెలలో విరగబూసిన బంతి పూలు

50 మంది రైతులు 40 ఎకరాల్లో సాగు

చెన్నూర్/నెన్నెల: బీడు భూములు ప్లాట్లుగా మారడంతో తంగేడు చెట్లు కనిపించడం లేదు. కలుపు నివారణకు గడ్డి మందులు వాడటంతో గునక చెట్లు అంతరించిపోయాయి. దీంతో బతుకమ్మలు పేర్చడానికి ఎక్కువగా బంతి పూలను ఉపయోగిస్తున్నారు. బతుకమ్మ, దసరా, దీపావళి పండగలపై ఆధారపడి కోటపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, పిన్నారం, నక్కలపల్లి, శంకరాపూర్, షెట్‌పల్లి, కొండంపేట గ్రామాల్లో ఈ ఏడాది 50 మంది రైతులు సుమారు 40 ఎకరాల్లో బంతిపూల సాగు చేశారు. దిగుబడి బాగానే ఉన్నప్పటికీ పూలకు డిమాండ్ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వ్యాపారులు రైతుల వద్దకు వచ్చి కిలోకు రూ.40 నుంచి రూ.50 చొప్పున కొనుగోలు చేశారని, ఈ ఏడాది రూ.30కి కూడా తీసుకోవడంలేదని రైతు సమ్మన్న వాపోయాడు. నెన్నెల మండలంలోని నెన్నెల, కొత్తూర్, బొప్పారం, నందులపల్లి గ్రామాల్లో రైతులు ఎరుపు, పసుపు రంగు బంతి పూలను సాగు చేస్తున్నారు.

రెండెకరాల్లో సాగు చేశా..



చెన్నూర్: మూడేళ్ల నుంచి బంతిపూల సాగు చేస్తున్నా. రెండేళ్లు పూలకు మంచి డిమాండ్ ఉండడంతో లాభాలు వచ్చాయి. ఈ ఏడాది మండలంలో పూల సాగు పెరగడంతో డిమాండ్ తగ్గింది. గతేడాది వ్యాపారులు మా గ్రామానికి వచ్చి పూలు కొనుగోలు చేసి తీసుకెళ్లేవారు. ఈ ఏడాది మేమే హోల్‌సేల్ వ్యాపారుల వద్దకు పూలు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంది. సద్దుల బతుకమ్మ, దసరా పండుగలపైనే ఆశ ఉంది.

– పుప్పాల రాజమౌళి, శంకరాపూర్

లాభదాయకమే..



వేమనపల్లి: నీల్వాయి సమీపంలో 30 గుంటలు కౌలుకు తీసుకుని బంతిపూలు సాగు చేశాం. కిలోకు రూ.వందచొప్పున విక్రయిస్తున్నాం. నీల్వాయి వాగు వంతెన సమీపంలో రహదారి పక్కనే ఉండటంతో చాలా మంది కొనుగోళ్లకు వస్తున్నారు. 30 గుంటల్లో 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. గోదావరిఖని, మంచిర్యాల నుంచి వ్యాపారులు వచ్చి పూలు కొనుగోలు చేస్తున్నారు. పురుగు బెడద లేకుండా మందులు పిచికారీ చేసుకుంటే బంతిసాగు మంచి లాభదాయకమే.

– మోర్ల సమత, నీల్వాయి, వేమనపల్లి

ప్రోత్సాహం అందించాలి



దహెగాం: ఐదేళ్లుగా బంతిపూల సాగు చేస్తున్నా. ఈ ఏడాది 12 గుంటల్లో సాగు చేశా. రూ.15 వేల వరకు ఖర్చు అయ్యింది. బతుకమ్మ పండుగకు కిలోకు రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నా. ఖర్చులన్నీ పోనూ రూ.10 నుంచి రూ.15 వేల వరకు లాభం వస్తుంది. మార్కెటింగ్ సౌకర్యం లేదు. ఉద్యానవనశాఖ అధికారులు ప్రోత్సాహం అందిస్తే మరింత సాగు పెంచుతాం.

– రౌతు రాజన్న, రైతు, కుంచవెల్లి, దహెగాం

మూడేళ్లుగా సాగు చేస్తున్న..



పెంచికల్‌పేట్: ఎకరం విస్తీర్ణంలో మూడేళ్లుగా బంతిపూల సాగు చేస్తున్నా. ఈ ఏడాది కిలో బంతిపూలకు హోల్‌సేల్‌గా రూ.100, రిటేల్‌గా రూ.150కి విక్రయిస్తున్నా. నెల రోజుల కాలంలో ఖర్చులు పోను సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఆదాయం వస్తుంది.

– తెలిగె ప్రభాకర్, ఎల్కపల్లి, పెంచికల్‌పేట్

రూ.లక్షకుపైగా ఆదాయం



జైపూర్: ఎనిమిదేళ్లుగా బంతిపూల సాగు చేస్తున్నా. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలకు పూలు అందేలా ఈ ఏడాది రెండెకరాల విస్తీర్ణంలో మూడు రకాల బంతిపూలు సాగు చేశా. బతుకమ్మ పూలకు మార్కెట్‌లో భలే డిమాండ్ ఉంది. కిలోకు రూ.వంద చొప్పున విక్రయిస్తూ ఏటా రూ.లక్షకు పైగా లాభాలు అర్జిస్తున్నా.

– జాడి శ్రీకాంత్, పొనూర్, జైపూర్

సుబ్బరాంపల్లిలో సీతమ్మపూలు



సీతమ్మ పూల తోటలో రైతు రమేశ్

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుబ్బరాంపల్లికి చెందిన రాతిపల్లి రమేశ్ పది గుంటల్లో సీతమ్మ జెడ పూలను సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు సాగుకు రూ.20 వేల వరకు ఖర్చు అయ్యిందని, మార్కెట్‌లో ఒక్కో కట్ట (కిలో) రూ.100 చొప్పున విక్రయిస్తున్నట్లు పేర్కొన్నాడు. బతుకమ్మ సీజన్ అయ్యే సరికి సుమారు 35 నుండి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నాడు.

పీజీ చదివి.. పూలబాట

- బంతి, చామంతి, సీతమ్మ జడల సాగు
- వాణిజ్య పంటల వైపు మొగ్గు



బంతి పూలతోటలో పెండ్యాల శ్రీనివాస్

లక్సెట్టిపేట: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన పెండ్యాల శ్రీనివాస్ హైదరాబాద్‌లో పీజీ(ఎమ్మెస్సీ జువాలజీ) పూర్తి చేశాడు. నాలుగేళ్లపాటు ఉద్యోగాన్వేషణ చేసినా ఫలితం లేకపోండంతో ఇంటిబాట పట్టాడు. తమ కుటుంబానికి ఉన్న ఆరెకరాల్లో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఒకే రకమైన పంట కాకుండా విభిన్న రకాలుగా నూతన శైలిలో పండించాలని కొంత భాగం వరికి వదిలి పూల తోటల వైపు మళ్లాడు. దసరా, దీపావళికి చేతికొచ్చేలా బంతి, సీతమ్మజెడలు, చామంతి సాగు చేస్తున్నాడు. ఇవి పూర్తి కాగానే అదే భూమిలో బెండకాయలు, కొత్తిమీర, ఎల్లిపాయలు సాగు చేస్తుంటాడు. దీంతో పంట మార్పిడితో దిగుబడి అధికంగా ఉంటోంది. బంతి, చామంతి, సీతమ్మజెడలు పూలను మంచిర్యాల, జగిత్యాల, జన్నారం తదితర ప్రాంతాల్లోని వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. వాణిజ్య పంటలపై దృష్టి సారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు పెండ్యాల శ్రీనివాస్ కోరుతున్నాడు. పనిముట్లు ఇవ్వాలని, శిక్షణ తరగతులు నిర్వహించాలని తెలిపాడు. పంటమార్పిడి చాలా అవసరమని, ఒకే రకమైన పంటతో ఇబ్బందికరంగా ఉంటుందని, ఒకటి నష్టపోతే మరొకటి లాభంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

వాతావరణం అనుకూలిస్తే..



చెన్నూర్‌రూరల్: నాకున్న ఐదు గుంటల్లో ఈ ఏడాది బంతిపూల సాగు చేశా. విత్తనాల కోసం రూ.3వేలు ఖర్చు చేశా. రూ.3 వేలు పురుగు మందులు, ఇతర మందులు స్ప్రే చేశాను. ప్రస్తుతం పూలు బాగానే ఉన్నాయి. వాతావరణం అనుకూలిస్తే లాభాలు ఉంటాయి.

– తడకల బాపు, రైతు, అంగ్రాజ్‌పల్లి

పోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్: పోక్సో కేసులో ఒకరికి జీవిత ఖైదుతోపాటు రూ.70వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన 8వ తరగతి బాలిక(17) చదువు మానేసి వ్యవసాయ పనులు చేసుకుంటూ ఇంటి వద్దే ఉంటుంది. ఇద్దరు పిల్లలు ఉన్న వివాహితుడు బడిగె తిరుపతి ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి బాలికను లోబర్చుకున్నాడు. బాలిక గర్భం దాల్చడంతో 2020 మే 20న తాళి కట్టాడు. బాలిక తల్లిదండ్రులు తాళి గురించి ప్రశ్నించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌటాల పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్సై ఆంజనేయులు నిందితుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. నిందితుడికి జీవిత ఖైదుతోపాటు రూ.70వేల జరిమానా విధిస్తూ, ప్రభుత్వం బాధితురాలికి రూ.8లక్షల పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ జగన్మోహన్‌రావు వాదించగా, లైజన్ ఆఫీసర్ రాంసింగ్ సాక్షులను ప్రవేశపెట్టారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన డీఎస్పీ వహిదుద్దీన్, కౌటాల సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై చంద్రశేఖర్, కోర్టు సీడీవో షిండే బాలాజీ, భరోసా సెంటర్ అడ్వకేట్ శైలజ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



పరిశీలిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఇంద్రవెల్లి: గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. మంచి పోషకాహారం, అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందిస్తున్న గుడ్లు, పాలు తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. ఆస్పత్రిలో శుద్ధ జల సమస్య ఉందని సిబ్బంది పీవో దృష్టికి తీసుకెళ్లగా ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడ్మెత మనోహర్, పూజిత, శ్వేత, సిద్ధార్థ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

మందమర్రిరూరల్: మందమర్రి–బెల్లంపల్లి రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం జరిగిన రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ జస్పాల్ సింగ్ తెలిపారు. హిస్సార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో గాయపడిన అతడిని బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని పేర్కొన్నారు. అతడి వయస్సు 40 నుంచి 45 మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 87126 58596 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

పిడుగుపాటుకు గేదెల కాపరి..



పోశెట్టి (ఫైల్)

నిర్మల్‌టౌన్: మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన సాకలి పోశెట్టి(52) పిడుగుపాటుకు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోశెట్టి గేదెలు కాస్తూ జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం మంజులాపూర్ పెద్దచెరువు సమీపంలో గేదెలు మేపుతున్నాడు. సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా.. బుధవారం నీటిమడుగులో విగత జీవిగా కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లివస్తూ అనంతలోకాలకు..



బలిరాం (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగా లేదని ఆస్పత్రికి వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉట్నూర్ మండలంలోని శంకర్ నాయక్ తండాకు చెందిన జాదవ్ బలిరాం(73)మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో బైక్‌పై హస్నాపూర్ తీసుకెళ్లాడు. తిరుగుప్రయాణంలో గ్రామ సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు రిమ్స్‌కు రెఫర్ చేశారు. పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

గడ్డెన్నవాగు కాలువలోపడి ఒకరు మృతి

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామ సమీపంలో ఉన్న గడ్డెన్నవాగు ప్రాజెక్టు కాలువలోపడి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. బిహార్‌లోని ముధపర్‌నగర్‌కు చెందిన వినోద్ సహాని (35) ఉపాధి నిమిత్తం జిల్లాకు వచ్చి మండలంలోని రాజేశ్‌తండా సమీపంలోని రైస్‌మిల్లులో హమాలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి ముఖఃదం గులాబ్ సహానితో కలిసి పుస్పూర్‌లో మద్యం సేవించాడు. ఇంటికి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు పుస్పూర్ గ్రామ శివారులోని గడ్డెన్న వాగు ప్రాజెక్టు కాలువలో పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని పెదనాన్న కుమారుడైన రాజ్‌గిర్ సహాని ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతదేహానికి రీ పోస్టుమార్టం

ఇచ్చోడ: మండలంలోని బావోజీపేట్‌లో విద్యుత్ ఉచ్చుకు బలైన మండాడి రంబు మృతదేహానికి బుధవారం రీపోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు చెందిన ముగ్గురు వైద్యులు, స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ జాదవ్ రమేశ్ సమక్షంలో పూడ్చిపెట్టిన శవాన్ని బయటకు తీసి రీపోస్టుమార్టం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం మృతదేహాన్ని పూడ్చి వేశామని, ఘటనకు బాధ్యుడైన చిక్రం పాండు ఫరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త..!

- నగలు, నగదు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోండి
- చైన్ స్నాచర్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



మంచిర్యాలలో అర్ధరాత్రి వివరాలు ఆరా తీస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

మంచిర్యాలక్రైం: దసరా, బతుకమ్మ పండుగల ఏర్పాట్లలో ప్రజలు పూర్తిగా నిమగ్నమై ఉంటారు. ఇదే అదును భావించిన దొంగలు స్వైరవిహారం చేస్తుంటారు. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం పట్టణాల నుంచి పల్లె బాట పడుతున్నారు. కొత్త బట్టలు, వస్తువుల కొనుగోలుకు షాపింగ్ చేస్తున్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మార్కెట్లలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఇదే సమయంలో దొంగలు, చైన్‌స్నాచర్స్, పిక్‌పాకెటర్స్ చోరీలకు పాల్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ నెల 23న అర్ధరాత్రి మంచిర్యాల జిల్లా కేంద్రంలో చెడ్డిగ్యాంగ్ సంచారం కలకలం రేపింది. సీసీసీ నస్పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. గోదావరివాడలో మరో ఇంట్లో చోరీకి యత్నించగా పోలీసులు తిప్పికొట్టారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులను మంచిర్యాల డీసీపీ భాస్కర్ అప్రమత్తం చేశారు. రాత్రి 10గంటలు దాటిందంటే అనుమానాస్పదంగా కనిపించిన వారిపై కొరఢా ఝులిపిస్తున్నారు. పెట్రోలింగ్ నిఘా పెంచారు. వేలిముద్రలు సేకరిస్తూ జైలు నుంచి విడుదలైన పాత నేరస్తులపై నిఘా పటిష్టం చేశారు.

ఇవి పాటించండి..

- ఊరు వెళ్లే వారు పక్కింటి వాళ్లకు చెప్పాలి. ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఎన్ని రోజులు, ఎక్కడికి వెళ్తున్నారనే సమాచారం ఇస్తే పోలీసులు వీధుల్లో నిఘా వేస్తారు.
- వైఫై బేస్‌డ్ రోబో కెమెరాను అమర్చుకోవాలి. దీంతో ఇళ్లలో జరిగే విషయాలపై సెల్‌ఫోన్‌కు అలర్ట్ రింగ్‌టోన్ వస్తుంది. అది వారికి వినిపించదు. దొంగతనం చేస్తుండగానే పట్టుకునే అవకాశం ఉంటుంది. నాలుగు సెల్‌ఫోన్‌లకు వినియోగించుకోవచ్చు. ఒక పోలీస్ అధికారి నంబరు కూడా ఇవ్వొచ్చు.
- సైరన్ మోగే తాళాలు సైతం మార్కెట్‌లో లభిస్తున్నాయి. స్థోమతను బట్టి కొనుగోలు చేయవచ్చు. తాళం కదిలించే ప్రయత్నం చేస్తే సైరన్ మోగుతుంది. దీంతో పక్క ఇళ్లవారు అప్రమత్తం కావొచ్చు.
- అపార్టుమెంట్లలో వాచ్‌మెన్‌ను నియమించుకోవాలి.
- గుర్తు తెలియని వ్యక్తులు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలి.
- ఇళ్లలోని బంగారు ఆభరణాలు, నగదు, విలువైనవి బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.

ప్రయాణంలోనూ..

ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులు, రైళ్లలో ప్రయాణించే వారు విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలి. బస్టాండ్, రైల్వేస్టేషన్లలో జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో కొందరు మాయమాటలు చెప్పి నగదు, నగలు, బ్యాగులు కాజేసే ప్రమాదం ఉంటుంది. కళ్లు మూసి తెరిచేలోపు మాయమైపోతారు. సీసీ పుటేజీ కవరేజి ఉండే ప్రాంతంలో ఉండాలి. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలి. రాత్రివేళ, మద్యం సేవించి ప్రయాణం చేయడం మంచిదికాదు. ఏదైనా సమస్య, రోడ్డు ప్రమాదం సంభవిస్తే కుటుంబ సభ్యులు, స్నేహితులకు సమాచారం అందేలా ఫోన్‌నంబర్లు, అడ్రస్ అందుబాటులో ఉంచుకోవాలి. 100 డయల్, 108కు సమాచారం అందించాలి.

పాత నేరస్తులపై నిఘా పెంచాం..



పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెంచాం. మార్కెట్ ప్రాంతాల్లో మహిళల భద్రత కోసం షీ టీమ్ మఫ్టీలో ఉంటూ నిఘా కొనసాగుతోంది. పెట్రోలింగ్ బీట్స్ పెంచాం. క్రైం టీమ్ మఫ్టీలో బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశాం. పట్టణాల్లో 24గంటలూ పోలీసులు గస్తీ తిరుగుతుంటారు. డయల్ 100కు సమాచారం ఇస్తే ఐదు నిమిషాల వ్యవధిలో బ్లూ కోల్ట్స్ పోలీసులు మీ వద్ద ఉంటారు. ఈ నెల 23న రాత్రి చెడ్డిగ్యాంగ్ వ్యూహాన్ని తిప్పికొట్టాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. – ఎగ్గడి భాస్కర్, డీసీపీ,

వ్యభిచార ముఠా గుట్టు రట్టు

- పక్కా సమాచారంతో పోలీసుల దాడి
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిల



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో వ్యభిచార ముఠా గుట్టును పట్టణ పోలీసులు రట్టు చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన మహిళలు నాఫీస్ బేగం, బిల్కీస్ చంద్ నిర్మల్‌లోని ఇంద్రానగర్ ప్రాంతంలో ఓఇంటిని కేంద్రంగా చేసుకుని కొంతకాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్నారన్నారు. మహిళలకు మాయమాటలు చెప్పి వ్యభిచార కూపంలోకి దింపుతున్నారన్నారు. విటులకు చరవాణి ద్వారా సమాచారం ఇచ్చి వ్యాపారం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పక్కా సమాచారంతో పోలీసులు ఇంటిపై దాడి చేసి మహిళలు, విటుడు ఇర్ఫాన్‌ను అరెస్టు చేసి రెండు మొబైల్ ఫోన్లు, మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అక్రమ దందాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

జిల్లాలో అక్రమ దందాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన షేక్ రాఫ్ అలియాస్ షేక్ రాఫ్ రహీం ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం పాలిషింగ్ చేసి విక్రయిస్తున్నాడన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలోని రైస్‌మిల్లుల్లో సన్నగా పాలిష్ చేసి తిరిగి కొన్ని బ్రాండ్ల పేరుతో నిర్మల్ జిల్లాతోపాటు చుట్టుపక్కల గల జిల్లాల్లో ఎక్కువ ధరలకు అమ్ముతున్నాడన్నారు. గతంలో రాఫ్‌కు సంబంధించిన 12 టైర్ల లారీని భైంసాలో జప్తు చేసినట్లు తెలిపారు.

గతంలో నిర్మల్‌కు చెందిన వ్యక్తి కిడ్నాప్

పట్టణంలోని సోఫీనగర్‌కు చెందిన షేక్ తహేర్ బియ్యం దందా చేస్తున్నాడని, ఈ క్రమంలో ధర్మాబాద్ (మహారాష్ట్ర)కు చెందిన షేక్ రాఫ్ భైంసాకు చెందిన అతని భాగస్వామి రహీజ్‌కు బియ్యం సంబంధిత లావాదేవీలలో రూ.4 లక్షలు ఇవ్వాల్సి ఉంది. ఈ విషయంలో లావాదేవీల పరిష్కారానికి దందాలు చేసే ఇబ్రహీం బిల్డర్ అలియాస్ మహమ్మద్ అబ్దుల్ ఇబ్రహీంతో రూ.1.50 లక్షలకు సుపారీ ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో మహమ్మద్ అబ్దుల్ ఐదుగురితో కలిసి జూలై 2, 2025న నిర్మల్‌కు వచ్చి షేక్ తాహేర్ బంధువును కిడ్నాప్ చేశారు. ఈ ఘటనలో నిర్మల్ పోలీసులు ఇబ్రహీం బిల్డర్‌ను 5 జూలై, 2025న అరెస్టు చేసి జైలుకు తరలించారు. దీంట్లో ప్రధాన నిందితుడైన షేక్ రాఫ్‌ను మంగళవారం రాత్రి నాందేడ్‌లో పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. కాగా షేక్ రాఫ్‌పై భైంసా, బాసర, తానూరు పోలీస్‌స్టేషన్‌లలో సైతం కేసులు నమోదైనట్లు ఎస్పీ పేర్కొన్నారు.

కిడ్నాపర్ నుంచి తప్పించుకున్న బాలుడు



బాలుడితో బాలసంరక్షణ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లోని చిల్కారినగర్‌కు చెందిన భరత్ అనే ఎనిమిదేళ్ల బాలుడు కిడ్నాపర్ చెర నుంచి తప్పించుకుని జిల్లాకు చేరుకున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. సికింద్రాబాద్‌లో రైలు ఎక్కి తలమడుగు మండలంలోని కోసాయి స్టేషన్‌లో బుధవారం దిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఏడుస్తూ కనిపించిన బాలుడి వివరాలు తెలుసుకున్న రైల్వేస్టేషన్ సిబ్బంది తలమడుగు పోలీసులతో పాటు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకుని కోసాయికి వెళ్లి బాలుడిని ఆదిలాబాద్ బాల రక్షక్ భవన్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. కాగా అపరిచిత వ్యక్తి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుండగా తప్పించుకుని రైలు ఎక్కానని బాలుడు చెప్పినట్లు పేర్కొన్నారు. చందు, సునీత తన తల్లిదండ్రులుగా చెబుతున్నాడని, కాగా బాలుడి గురించి మల్కాజిగిరి డీసీపీవో సిబ్బందికి సమాచారం అందించామని వివరించారు. ఆయన వెంట ష్యూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ కిల్లారే వినోద్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, వినోద్ తదితరులు ఉన్నారు.

నేడు ఎన్టీపీసీ ఉద్యోగ గుర్తింపు ఎన్నికలు



పూర్తయిన ఏర్పాట్లు



పోలింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

- ఏర్పాట్లు పూర్తిచేసిన యాజమాన్యం

జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాజెక్టులో ఉద్యోగ గుర్తింపు ఎన్నికల ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. గురువారం పోలింగ్ నిర్వహిస్తారు. మూడు సంవత్సరాల గుర్తింపు హోదా కోసం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మూడు యూనియన్లు బరిలో నిలిచాయి. ఎన్టీపీసీ యాజమాన్యం పర్యవేక్షణలో పోలింగ్ జరుగుతుంది. ఉద్యోగ సంఘం ఎన్నికల్లో ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్(ఐఎన్టీయూసీ), ఎన్టీపీసీ కార్మిక సంఘ్(బీఎంఎస్), ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) పోటీ చేస్తున్నాయి. 60 శాతం ఓట్లు సాధించిన యూనియన్‌లోని ఇద్దరు ప్రతినిధులకు ఎన్సీసీ అర్హత వస్తుంది. అదేవిధంగా 60 శాతం కన్నా తక్కువ ఓట్లు వస్తే రెండోస్థానంలో ఉన్న యూనియన్‌కు ఒక ఎన్సీసీ సభ్యుడికి అవకాశం ఉంటుంది. ఎన్టీపీసీలో మొత్తం 212 మంది ఓటర్లు ఉన్నారు.

పోలింగ్‌కు ఏర్పాట్లు

ప్రాజెక్టు పరిపాలనా భవనం ఆవరణలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 212 మంది ఓటర్లు ఉండగా ఈవీఎం ఆధారంగా పోలింగ్ నిర్వహిస్తారు. ఇందుకోసం రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారిగా ఏజీఎం(హెచ్‌ఆర్)బిజయ్‌కుమార్ సిగ్దర్ వ్యవహరిస్తున్నారు. ఉదయం 6 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 3.30గంటలకు ముగుస్తుంది. ఓటుహక్కు ఉన్న ఉద్యోగి సంస్థ ఐడీ కార్డుతో పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలి. పోలింగ్ పూర్తయ్యాక ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలను వెల్లడి చేయనున్నారు.

యూనియన్ల మాక్‌డ్రిల్

ఉద్యోగ గుర్తింపు యూనియన్ ఎన్నికలకు ఎన్టీపీసీ అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికలకు సన్నాహాలు చేస్తూ, పోలింగ్‌లో సజావుగా పాల్గొనేందుకు ఉద్యోగ సంఘాలు బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించాయి. మూడు ప్రధాన యూనియన్లు పోటీలో ఉన్నాయి. ప్రతీఒక్కటి ఉద్యోగుల మద్దతును పొందడానికి చురుకుగా ప్రచారం చేపట్టాయి.

విచ్చలవిడిగా ఎరువుల వినియోగం

- అతిగా వాడకం ప్రమాదకరమని హెచ్చరిస్తున్న నిపుణులు
- సేంద్రియ ఎరువులతోనే నేలకు జీవం
- దిగుబడితోపాటు భూసారం పెంపు
- జిల్లాలో 2.71 లక్షల ఎకరాల్లో వరి సాగు అంచనా



వరిపంటకు క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తున్న రైతు

వీణవంక: ఉత్తర తెలంగాణలోనే వరి సాగులో కరీంనగర్ జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఇక్కడి నేలలు సాగుకు అనుకూలంగా ఉండటంతో దిగుబడి కూడా గణనీయంగా ఉంటుంది. పండించిన ధాన్యానికి ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉండటం రైతులకు కలిసొస్తుంది. మూడేళ్లుగా మొగిపురుగు విజృంభిస్తుంది. దీనికి తోడు వివిధ రకాల తెగుళ్లు పైరును ఆశిస్తుండటంతో రైతులు పంటను కాపాడుకునేందుకు నారుమడి నుంచే విచ్చలవిడిగా రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం పొలాలు పొట్టదశలో ఉండగా, కొన్ని చోట్ల పిలక దశలో ఉంది. ఇప్పటివరకు ఒక్కో రైతు సగటున నాలుగు నుంచి ఐదుసార్లు మందులను పిచికారీ చేశారు. ఇంకా పంట చేతికి వచ్చేసరికి మరో రెండుసార్లు పిచికారీ చేయాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2.71లక్షల ఎకరాల్లో వరి సాగు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మధ్యకాలంలో రైతులు అధిక రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో భూసారం తగ్గి పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడనుంది. రసాయన ఎరువుల వాడకం బదులు సేంద్రియ ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడులతో పాటు భూసారం పెరుగుతుంది. అయితే రైతులు వీలైనంత వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగిస్తే పంటకు అన్ని రకాల పోషకాలు అందుతాయని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు చెప్పుతున్నారు.

విచ్చలవిడిగా రసాయనాలు

ఈ సీజన్ ప్రారంభంలో నారుమడికి మొగిపురుగు తగిలింది. దీంతో రెండునుంచి మూడుసార్లు పిచికారీ చేశారు. నాటువేసిన 15రోజులకు గుళికలతో పాటు యూరియాలో రసాయన మందులను కలిపి పొలంలో చల్లారు. మళ్లీ నెలతర్వాత మొగిపురుగుతో పాటు తెగుళ్లు వ్యాప్తిచెందాయి. దీంతో మళ్లీ పిచికారీ చేశారు. ప్రస్తుతం సుడిదోమ వ్యాప్తి చెందుతుంది. ఒక్కో రైతు పంటకాలం పూర్తయ్యేసరికి ఎకరాకు రూ.15వేల విలువగల ఖరీదైన రసాయన మందులను చల్లుతున్నారు. దీనికి బదులు సేంద్రియ ఎరువులు(జీవామృతం) వాడితే బాగుండేదని అధికారులు తెలుపుతున్నారు.

పశువుల ఎరువు మేలు

సేంద్రియ ఎరువులైన పశువుల ఎరువు, కంపోస్టు, ఫిల్టర్‌మడ్డి, వ్యవసాయ వ్యర్థ పదార్థాలు, జీవన ఎరువులు ఇలాంటి వాటిని ఎక్కువగా రైతులు వినియెగించాలి. గ్రామాల్లో పశువుల ఎరువు దొరుకుతుంది. ఏటా ఈ ఎరువును పొలంలో చల్లాలి. పంట ఏపుగా వస్తుంది. కొందరు రసాయన ఎరువులను ఇష్టానుసారంగా వాడుతున్నారు. దీంతో భూసారం కోల్పోయి పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది.

భూసార పరీక్ష చేసుకోవాలి

ఏటా భూసార పరీక్షలు చేసుకోవాలి. దీంతో భూమిలో ఎంతమేరకు ఎరువులు, ఏఏ ఎరువులు వాడాలో తెలుస్తుంది. నాట్లు వేసిన తర్వాత రైతులు సరైన సమయంలో ఎరువులు వేసుకోవాలి. వ్యవసాయాధికారుల సూచనల ప్రకారం ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులో పంట చివరి దశవరకు రెండు, మూడు దఫాలుగా చల్లుకోవాలి. యూరియా రూపంలో నత్రజనిని వాడినప్పుడు బస్తా యూరియాకు 10కిలోల వేప పిండి వేసుకుంటే మంచిది.

సేంద్రియ ఎరువుల వాడకం మేలు

రసాయన ఎరువులు విచ్చలవిడిగా పిచికారీ చేయడం మంచిది కాదు. సేంద్రియ ఎరువులు నేలకు మంచిది. సిఫార్సు మేరకే ఎరువులు వాడాలి. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి. ఒకేరకమైన పంట ఏళ్ల తరబడి వేసే బదులు పంట మార్పిడి చేస్తే పురుగు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుంది. – రాకేశ్ వ్యవసాయ విస్తరణాధికారి, వీణవంక

అశ్వవాహనంపై విహారం



వేములవాడ: నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఉత్సవమూర్తులను అశ్వవాహంపై ఊరేగించారు. వర్షం కారణంగా పురవీధుల్లో గ్రామ సేవను రద్దు చేసి, ఆలయ ఆవరణలోనే నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఈవో రమాదేవి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఏఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీపీవోలే ప్రభుత్వానికి కళ్లు, చెవులు

- క్షేత్రస్థాయిలో నిబద్ధతతో పని చేయండి
- జీపీవోల ఆత్మీయ సమ్మేళనంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి



మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

కరీంనగర్ అర్బన్: గ్రామస్థాయిలో ప్రజలకు, రైతులకు మేలు జరగాలనే ప్రభుత్వ సంకల్పం జీపీవో (గ్రామ పాలన అధికారులు)లు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. ఇటీవల రెవెన్యూ శాఖలో నియామకమైన జీపీవోలు అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. బుధవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో గ్రామ పాలన అధికారుల ఆత్మీయ సమ్మేళనం కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని రెవెన్యూ గార్డెన్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన జీపీవోలకు భూభారతి చట్టంపై అవగాహన, విధులు, బాధ్యతలతో పాటు పారదర్శకత, అంకిత భావంతో కూడిన పౌరసేవలపై దిశానిర్దేశం చేశారు. ఏ ఒక్కరు తప్పు చేసినా అది మొత్తం వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందన్నారు. జీపీవోల సమస్య తీరిందని, ఇతరుల సమస్యలను విస్మరించవద్దన్నారు. కారుణ్య నియామకాలకు సంబంధించి త్వరలోనే తీపి కబురు వస్తుందన్నారు. ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి సారథ్యంలో గ్రామ పాలన అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి అన్నారు. టీజీటీఏ జనరల్ సెక్రటరీ రమేశ్ పాక మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువత ఎంత కీలకమో, రెవెన్యూ వ్యవస్థకు జీపీవోలు అంతే కీలకమన్నారు. టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.బిక్షం, రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ చిల్లా శ్రీనివాస్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కరీంనగర్ నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నేరేళ్ల కిషన్, రమేష్, టీజీటీఏ కరీంనగర్ నగర్ కార్యదర్శి రాజేశ్వరి, నవాజ్ షరీఫ్, రిటైర్డ్ తహసీల్దార్ గంప శంకరయ్య, మల్లారం అర్జున్, ఆంజనేయ ప్రసాద్, సాయి కిషోర్, బాపుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

వందల ఏళ్ల నాటి ఆచారం బతుకమ్మ

- మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్
- జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మంత్రి సీతక్క, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, తదితరులు



బతుకమ్మతో ప్రఫుల్ దేశాయ్ దంపతులు

కరీంనగర్‌కల్చరల్: బతుకమ్మ పండుగ వందల ఏళ్ల నాటి సాంప్రదాయమని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ గ్రామీణాభివృది శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆకాంక్షించారు. కరీంనగర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నగరంలోని మ హాత్మా జ్యోతిబా పూలే మైదానంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి హాజరయ్యారు. బతుకమ్మ పండుగను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పా ట్లు పూర్తి చేస్తున్నామన్నారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, తెలంగాణ ఉమెన్ కోఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభా రాణి, కలెక్టర్ పమేళా సత్పతి ఆడిపాడారు.

కుళ్లిన కోడిగుడ్లేనా..!



ఇటీవల రాపనపల్లిలో సరఫరా అయిన గుడ్లు



చిన్న పరిమాణంలో కోడిగుడ్లు

- అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం సరఫరా
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పోషణ మాసోత్సవం సమయంలోనే నాణ్యతలేనివి పంపిణీ

వివరాలు అంగన్‌వాడీ కేంద్రాలు : 969 గర్భిణులు : 4,245 బాలింతలు : 3,186 చిన్నారులు : 39,229

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందకుండా పోతోంది. ఓ వైపు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16వరకు పోషణ మాసోత్సవాన్ని జిల్లా శిశు, మహిళా, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా.. మరోవైపు కుళ్లిన కోడిగుడ్లను సరఫరా చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ప్రజలకు వివరిస్తూనే నాసిరకం కోడిగుడ్లు అందిస్తున్నారు. ఇటీవల జిల్లాలోని కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామంలో లబ్ధిదారులకు కుళ్లిన కోడి గుడ్లు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు వారికి వచ్చిన ఓటీపీని చెప్పి కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ చిన్న పరిమాణంలో ఉన్నా, నాణ్యత లేకున్నా తీసుకుని లబ్ధిదారులకు అందిస్తుండడం, అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడేళ్ల వయస్సు పైబడిన చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పప్పు, ఆకుకూరలు, కోడిగుడ్డుతో కూడిన పౌష్టికాహార భోజనాన్ని మధ్యాహ్నం తింటున్నారు. మూడేళ్లలోపు చిన్నారులకు నెలకు 16 కోడిగుడ్లు, బాలామృతం ఇంటికే ఇస్తున్నారు. కోడిగుడ్లు ఇంటికి తీసుకెళ్లిన తర్వాత ఉడకబెట్టగా దుర్వాసన వస్తున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లేని గుడ్లు తినడం వల్ల చిన్నారులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. కాంట్రాక్టర్ నాసిరకమైన, చిన్న పరిమాణంలో ఉన్న గుడ్లు సరఫరా చేస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

కాంట్రాక్టర్ మార్పుతోనైనా మారేనా..!

ప్రస్తుతం కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ల స్థానంలో ఇటీవల ప్రభుత్వం టెండర్లు నిర్వహించి కొత్తవారికి కేటాయించింది. అంగన్‌వాడీ కేంద్రాలకే కాకుండా, జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని గురుకులాలు, హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరా చేసేందుకు అప్పగించగా, మరికొద్ది రోజుల్లోనే నూతన కాంట్రాక్టర్ నుంచి సరఫరా జరగనుంది. ప్రస్తుత కాంట్రాక్టర్ నాసిరకం కోడిగుడ్లు సరఫరా చేయకుండా నియంత్రించి, కొత్త కాంట్రాక్టర్ నాణ్యతతో కూడినవి సరఫరా చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. నిబంధనల మేరకు ఉన్న కోడిగుడ్లనే టీచర్లు తీసుకోవాల్సి ఉండగా, జిల్లా అధికారుల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉంటేనే సాధ్యమవుతుంది.

వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	969
గర్భిణులు	4,245
బాలింతలు	3,186
చిన్నారులు	39,229

నాణ్యతతో ఉన్నవాటినే తీసుకుంటున్నాం



జిల్లాలోని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసే కోడిగుడ్లు పూర్తి నాణ్యతతో ఉంటేనే తీసుకోవాలని టీచర్లకు చెబుతున్నాం. అందుకు తగినట్లుగానే సీడీపీవోలు, సూపర్‌వైజర్లు తనిఖీలు చేపడుతున్నారు. లబ్ధిదారులు కోడిగుడ్లను ఇంటికి తీసుకెళ్లిన ఎక్కువ రోజుల తర్వాత వాటిని ఉడికించడం వల్ల పాడైనట్లుగా గుర్తించారు. కోడిగుడ్లు చిన్న పరిమాణంలో ఉంటే వెనక్కి పంపించాలని, పాడైనవి ఉన్నా తీసుకోవద్దని ఆదేశించాం.

– రౌఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

మంచిర్యాలలో చెడ్డి గ్యాంగ్ స్వైర విహారం

- ఒకే రోజు మూడిళ్లలో చోరీ
- పోలీసులను చూసి పారిపోయిన ముఠా



అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం/నస్పూర్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆరుగురుతో కూడిన చెడ్డి గ్యాంగు ముఠా మంగళవారం అర్ధరాత్రి స్వైరవిహారం చేసింది. సీసీసీ పోలీసుస్టేషన్ పరిధిలోని విలేజ్ నస్పూర్‌లో ఓ ఇంట్లో చోరీ చేసి అక్కడి నుంచి మంచిర్యాలలోని సాయికుంట, గోదావరివాడలో రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. మరో ఇంట్లో చోరీకి యత్నించే క్రమంలో పోలీసులు వారి వ్యూహాన్ని తిప్పికొడుతూ పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక సాయికుంట వైపు నుంచి విలేజ్ నస్పూర్‌లో ప్రవేశించిన ముఠా నస్పూర్‌లోని వినూత్న కాలనీకి చెందిన మోండె దేవక్క ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. అక్కడి నుంచి సాయికుంట, గోదావరివాడ ప్రాంతంలో రెండిళ్లలో రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. స్థానికులు గమనించి 100 డయల్‌కు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, సీఐలు ప్రమోద్‌రావు, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. గోదావరివాడలో మరో ఇంట్లో దొంగతనానికి యత్నించగా.. అప్పటికే గాలిస్తున్న పోలీసులను చూసి పారిపోవడం గమనార్హం. పోలీసులు గాలిస్తుండగా కొందరు వ్యక్తులు చెడ్డీలు వేసుకుని తారసపడగా అనుమానితులను విచారించి వదిలేసినట్లు తెలిసింది. పోలీసులు వెంటనే అప్రమత్తం కావడంతో మరిన్ని ఇళ్లలో దొంగతనాలను నివారించగలిగారు. రాత్రి, పగలు అనుమానితులు కాలనీల్లో కనిపిస్తే వెంటనే 100 డయల్‌కు సమాచారం అందించాలని డీసీపీ భాస్కర్ తెలిపారు.

కోలిండియా పోటీలకు బాడీ బిల్డర్ల ఎంపిక





కోలిండియా పోటీలకు ఎంపికైన మొగిలి, అర్జున్

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన ఇద్దరు బాడీ బిల్డర్లు కోలిండియా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం రాత్రి సింగరేణి కంపెనీ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. సింగరేణి ఉద్యోగులు జనగామ మొగిలి 75కిలోల విభాగంలో, పెసరి అర్జున్ 70కిలోల విభాగంలో పాల్గొని ప్రథమ బహుమతి గెల్చుకున్నారు. కోలిండియా స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ పోటీలు వచ్చే అక్టోబర్‌లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరగనున్నాయి. ఇద్దరు బాడీ బిల్డర్లను సైకిజిమ్ కోచ్ సదానందం, జిమ్ నిర్వాహకులు బాలకృష్ణ, చంద్రశేఖర్, క్రీడాకారులు అభినందించారు.

మందమర్రి క్రీడాకారులు..

మందమర్రిరూరల్: కోలిండియా పోటీలకు మందమర్రి ఏరియా క్రీడాకారులు ఎంపికయ్యారు. మందమర్రి వర్క్‌షాపులో ఈఎఫ్ఎం విధులు నిర్వరిస్తున్న బత్తుల వెంకటస్వామి బాడీ బిల్డింగ్(95 కిలోల విభాగం)లో, కాసిపేట–1 గనిలో పంపు ఆపరేటర్ బెల్లం అరుణ్ వెయిట్ లిఫ్టింగ్(79 కిలోల విభాగం)లో బంగారు పతకాలు సాధించారు. వారిని కోలిండియా పోటీలకు ఎంపిక చేశారు. ఏరియా జీఎం రాధాకృష్ణ, ఎస్వో టు జీఎం జయప్రసాద్, శ్యామ్‌సుందర్, శివకృష్ణ అభినందించారు.

'ఎన్‌కౌంటర్లతో ఉద్యమాన్ని అణచివేయలేరు'



జోహార్లు అర్పిస్తున్న నాయకులు, కుటుంబీకులు

బెల్లంపల్లిరూరల్: మావోయిస్టులపై బూటకపు ఎన్‌కౌంటర్లతో విప్లవ ఉద్యమాన్ని అణచివేయలేరని విప్లవ రచయితల సంఘం(విరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పినాకపాణి, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పద్మకుమారి, ప్రధాన కార్యదర్శి శాంతక్క, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ టెక్నికల్ టీమ్ ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు జాడి వెంకటి అలియాస్ విమల్(56) సంస్మరణ సభ బుధవారం మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో నిర్వహించారు. వెంకటి చిత్రపటానికి కుటుంబ సభ్యులు, ఆయా సంఘాల నేతలు పూలమాలలు, కళాకారులు పాటలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మావోయిస్టు పార్టీ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మహ్మద్ హుస్సేన్, విరసం నాయకుడు రాజన్న, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమారస్వామి, నాయకులు లక్ష్మణ్, సారయ్య, పోషన్న, జైపాల్ సింగ్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు చాంద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

- లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తాం
- తుడుందెబ్బ తెలుగు రాష్ట్రాల ఉమ్మడి అధ్యక్షుడు అరుణ్‌కుమార్
- ఇంద్రవెల్లిలో ఆదివాసీల భారీ ర్యాలీ



భారీ ర్యాలీగా బయలుదేరిన ఆదివాసీలు

ఇంద్రవెల్లి: చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీలు మండలకేంద్రంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ముందుగా ఇంద్రవెల్లి, సిరికొండ మండలాలకు చెందిన తొమ్మిది తెగల వారు పాదయాత్రగా స్థానిక అమర వీరుల స్తూపం వరకు చేరుకుని నివాళులర్పించారు. అనంతరం స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రాంగణానికి ర్యాలీగా చేరుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తుడుందెబ్బ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడారు. ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులన్నారు. 1976 అనంతరం లంబాడాలు అప్పటి ప్రభుత్వాలను మోసం చేసి ఎస్టీ జాబితాలో చేరారని ఆరోపించారు. వారిని వెంటనే ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, లేని పక్షంలో రాయిసెంటర్ సార్‌మేడీలతో చర్చించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షుడు కొట్నాక్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ, చట్ట బద్ధతలేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు శాంతియుత ఆందోళనలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావ్, జిల్లా అధ్యక్షుడు దాదిరావ్, రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, ఆదివాసీ తొమ్మిది తెగల సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు ఆర్క ఖమ్ము, పెందోర్ పుష్పరాణి, సోయం భీంరావ్, కోవ దౌలత్‌రావ్, కుడే కైలాస్, విష్ణు, భీంరావ్, రాయిసెంటర్ సార్‌మేడీలు, ఆదివాసీలు పాల్గొన్నారు.

భూములున్నా అడవి కొడుతున్నారు..

- ఇదివరకే అందరి పేరిట పట్టాలు
- జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్



ఎఫ్‌డీవో రామ్మోహన్

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్, కవ్వాల్ సెక్షన్ సోనాపూర్ తండా పాలాఘోరీ ప్రాంతంలో అక్రమంగా ఆవాసాలు ఏర్పాటు చేసుకున్న ఆదివాసీ గిరిజనులకు ఇప్పటికే వారి పేరిట లావణి పట్టా భూములు, ఆర్‌వోఎఫ్ఆర్ భూములున్నాయని, అయినా అడవి కొడుతున్నారని జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్ తెలిపారు. బుధవారం జన్నారం అటవీ డివిజన్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఒక్కొక్కరి పేరున 10 నుంచి 20 ఎకరాల వరకు లావణి పట్టా, ఆర్‌వోఎఫ్అర్ కింద భూములున్నాయని తేలిందని అన్నారు. నార్నూర్ మండలానికి చెందిన ఆత్రం భీంరావుకు లావణి పట్టా కింద 24.08 ఎకరాల భూమి ఉందన్నారు. సిర్పూర్ యూ మండలం పంగిడికి చెందిన ఆత్రం జంగుబాయి పేరున 10.15 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఇలా 15 మంది వివరాలు సేకరించామని, వీరిలో ముగ్గురి పేరున ఆర్‌వోఎఫ్ఆర్ హక్కు పత్రాలు, మిగతా 12 మంది పేరున లావణి పట్టాలున్నాయని తెలిపారు. ఇప్పటికే 26 మందిని అరెస్టు చేశామని, చట్ట విరుద్ధంగా అడవిలోనే ఉంటే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వెంటనే అడవి నుంచి ఖాళీ చేసి ఇళ్లకు వెళ్లాలని సూచించారు.